క్లుప్తంగా

గాయల్ మాత ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు



జనగామ: జిల్లా కేంద్రంలోని బాణాపురం హనుమాన్, గాయల్ మాత దేవాలయంలో శుక్రవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉత్స వాల్లో గోపాల్ గోశాల సభ్యులతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. చిన్నారులు రాధా,కృష్ణులు, గోపికల వేషధారణలతో అలరించారు. విజేతలకు బహుమతులు అందించారు.

'పోచంపల్లి' చిత్రపటానికి క్షీరాభిషేకం

నర్మెట: రాజకీయాలు కాదు అభివృద్ధే ముఖ్యం .. పల్లా రాజేశ్వర్ రెడ్డి వద్దు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డే ముద్దు అంటూ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి మండల సమాఖ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, నాయకులు మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్ , సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామిని శివరాజ్, సర్పంచ్‌లు భూక్య శ్రీనివాస్, లకావత్ కిరణ్ కుమార్, కంతి హేమలతా రాజలింగం, రజితా రవి, జ్వాల స్వేతా కిషన్, సీరటి రాణి సుధాకర్, ఎంపీటీసీ ఏర్పుల చైతన్యా హెబ్బేజర్ పాల్గొన్నారు.

జనగామ టికెట్ కోసం దశమంతరెడ్డి దరఖాస్తు



జనగామ: జనగామ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా హైదరాబాద్‌కు వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సొడ రమేష్, శివరాజ్ యాదవ్, కర్ర శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ కొంతం శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రేమలతారెడ్డి, కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, పవన్ శర్మ, బండారి తిరుపతి, సద్ది సోమిరెడ్డి, ఆవుల శ్రీనివాస్, భిక్షపతినాయక్, ఉడుగుల రమేష్, కేవీఎల్ఎన్.రెడ్డి, సాగర్‌రెడ్డి, అంజిరెడ్డి, యుగంధర్ రెడ్డి, బొజ్జపల్లి సుభాష్, శశిధర్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ కోసం..

లింగాలఘణపురం: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి టికెట్‌ను కోరుతూ జనగామకు చెందిన కౌన్సిలర్ బొట్ల శ్రీనివాసు శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా సేవలు అందిస్తున్న తనకు పార్టీ అవకాశం కల్పించాలని కోరారు.

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గం ప్రభారి ఉడుగుల రమేష్ హైదరాబాదులోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు.

ములుగు టికెట్ కోసం..

చిల్పూరు: మండలంలోని దేశాయితండాకు చెందిన బీజేపీ జిల్లా గిరిజన మోర్చా జనరల్ సెక్రెటరీ భూక్య అనీల్ నాయక్ ములుగు జిల్లా బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం శుక్రవారం దరఖాస్తు చేసుకున్నాడు.

మదర్‌మేరీ జన్మదిన వేడుకలు



దేవరుప్పుల: మండల కేంద్రంలోని బాల యేసు ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో బ్రదర్ జేసురాజు ఆధ్వర్యంలో మదర్‌మేరీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని శుక్రవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ ఫ్రాన్సిస్‌జాన్ మాట్లాడుతూ భూలోకంలో లోక కల్యాణార్థం ప్రాణత్యాగం చేసిన యేసుకు జన్మనిచ్చిన మాతృమూర్తి మదర్‌మేరీ గొప్పతనాన్ని భావితరాలకు చాటాలన్నారు. ఉపాధ్యాయులు మదన్‌మోహన్ పాల్గొన్నారు.

గీతకార్మికుడికి తీవ్ర గాయాలు

రఘునాథపల్లి: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడిన గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నిడిగొండలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్కపురం అంజయ్య రోజు వారిగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అంజయ్యను తోటి గీత కార్మికులు గుర్తించి వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. బాధితుడికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆర్థికసాయం చేయాలని గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



బచ్చన్నపేట: సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు, అధికారులు



దేవరుప్పుల: రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత అంజయ్యను సన్మానించిన బాల్యమిత్రులు

బచ్చన్నపేట: ఉపాధ్యాయులు మట్టిలోని మాణిక్యాలను వెలికి తీస్తారని అందుకే ఆ వృత్తి చాలా పవిత్రమైనదని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండల నోడల్ అధికారి డీవీఎల్ఎన్ మూర్తి అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా ఉపాధ్యాయ స్థానం మారదని అలుపెరుకుండా శ్రమిస్తారని అన్నారు. ఈ సందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులు అన్నపూర్ణ, రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో నవీన్, సత్తిరెడ్డి, రమాకుమారి, మోడల్ స్కూల్ మీసాల సుధాకర్, కేజీబీవీ నుంచి సుమలతలను ఘనంగా సాన్మనించారు. ఉపాధ్యాయ సంక్షేమ నిధి శాశ్వత అధ్యక్షుడు వేముల బాలరాజు, ఉపాధ్యాల సంఘాల భాధ్యులు నూకల ఎల్లారెడ్డి, చంద్రశేఖర్‌రావు, లక్ష్మయ్య, యాదయ్య, సంతోష్, కృష్ణమూర్తి, అంకుషావళి, పరశురామ్, కనుకయ్య, నర్సింహారావు, లక్ష్మారెడ్డి, సతీష్ పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులంతా ఉత్తములే

లింగాలఘణపురం: ఉపాధ్యాయులంతా ఉత్తములేనని, ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఎవరో ఒకరిద్దరిని సన్మానించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ విద్యాబోధనలో ఎంతో కృషి చేస్తున్నారని ఎంపీపీ చిట్ల జయశ్రీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన నెల్లుట్ల హైస్కూల్ ఉపాధ్యాయురాలు అరుంధతిని అభినందించారు. పాఠశాలలకు మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని, నేలపోగులలో పాఠశాల అభివృద్ధి కృషి చేస్తున్న ఎన్ఆర్ఐ కేసరి లక్ష్మీ నారాయణ సహకారాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిన 26 మందిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా నెల్లుట్లకు చెందిన నడిగోటి సోమయ్య భాస్కర్, శ్రీనివాసు, రమేష్ విద్యావంతుల కుటుంబ సభ్యులు నెల్లుట్ల ఉన్నత పాఠశాలకు రూ.లక్ష, ప్రాథమిక పాఠశాలకు రూ.50వేలు అభివృద్ధికి విరాళంగా ప్రకటించారు. ఎంఈఓ చంద్రారెడ్డి, ఎంపీడీఓ సురేందర్, ఆయా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి బాల్యమిత్రుల సన్మానం

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అంబటి అంజయ్యను బాల్యమిత్రులు ఘనంగా సన్మానించారు. నడిదె సీతారామిరెడ్డి,బిట్ల వెంకటేశ్వర్లు నీలారపు వెంకన్న, యేల వీరాస్వామి, రామచారీ, బుర్ర ప్రభాకర్, లక్ష్మీపతి, ఉపాధ్యాయులు ఉమారాణి, ఉషారాణి పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే నిస్వార్థంగా సేవ చేస్తా..

రిటైర్డ్ అడిషనల్ డీసీపీ,
కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభాకర్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజా సేవ చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చాను.. ఆశీర్వదిస్తే నిస్వార్థంగా సేవ చేస్తానని రిటైర్డ్ అడిషనల్ డీసీపీ, హైకోర్టు అడ్వకేట్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చంద్రపలకల ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు గత నెల 25న హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పార్టీ అవకాశమిస్తే పోటీలో ఉంటానని, లేనిపక్షంలో అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేస్తానని చెప్పారు. సంపాదన కోసం రాజకీయాల్లోకి రావడంలేదు.. ఉన్నంతలో నిరుపేదలకు సేవ చేయాలనే ధ్యేయంతో వస్తున్నాను.. ఆశీర్వదిస్తే అభివృద్ధి పాటుపడతానని పేర్కొన్నారు. సమావేశంలో కన్నా తిరుపతి, ఎస్.ప్రధాన్, స్వీకృత్, షేక్ అబీద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ నేతగా జనగామ టికెట్ ఇవ్వండి: మండల శ్రీరాములు

జనగామ: జనగామ బీఆర్ఎస్ టికెట్ తనకు కేటాయించి, బీసీల మద్దతును మరింత బలోపేతం చేసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మండల శ్రీరాములు అన్నారు. జనగామ భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో మొదటి నుంచి కేసీఆర్‌ను నమ్ముకుని పని చేస్తున్నామన్నారు. సీఎం ఆశీస్సులతో టికెట్ తనకే వస్తుందని నమ్మకం ఉందన్నారు. నాయకులు వజ్జ పర్శరాములు, దోర్నాల వెంకటేశ్వర్లు, బొట్ల అమృతం, బోగ రాండయాకర్, బిట్ల శంకర్ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

జీపీ నిధుల దుర్వినియోగంపై విచారణ



జఫర్‌గఢ్: స్థానిక గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డీపీఓ రంగాచారి శుక్రవారం విచారణ చేపట్టారు. జీపీకి సంబంధించిన నిధులను సర్పంచ్, ఉప సర్పంచ్, పాత పంచాయతీ కార్యదర్శి, పీఆర్ ఏఈ, ఎంపీఓ కలసి పెద్ద ఎత్తున స్వాహా చేశారని వార్డు సభ్యులు కాట సుధాకర్, కుక్కల ఎల్లయ్యతో పాటు సీపీఎం నాయకులు గతంలో కలెక్టర్, డీపీఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో డీఎల్‌పీఓ విచారణ చేపట్టగా మళ్లీ ఇదే విషయంపై డీపీఓ రంగాచారి విచారణ చేపట్టారు. జీపీకి సంబంధించిన పలు రికార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్పంచ్ బల్లెపు నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, వార్డు సభ్యులు కాట సుధాకర్, కుక్కల ఎల్లయ్య, కుక్కల సారంగపాణి, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ.నజీర్, సీపీఎం మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న శాంతన్

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అందరూ కృషిచేయాలని భువనగిరి పార్లమెంట్ మహిళా అబ్జర్వర్ శాంతన్ పిలిఫిన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల మహిళా అధ్యక్షురాలు బొమ్మెర్ల వేణు వందన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 స్థానాలలో గెలుపొంది అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, వంగాల కళ్యాణి, కామిని జయ, బుర్రా బాలమణి, నీల కృష్ణవేణి, కంతం రేణుక, మల్యాల ప్రమీల, కనకధార, శ్రీనివాస్, నారాయణరెడ్డి, రాజయ్య, బుచ్చిరాజు, ఎల్లారెడ్డి, మల్లయ్య, బాల్‌రాజు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడాలి



మాట్లాడుతున్న కల్నల్ మాచర్ల బిక్షపతి

జనగామ : ముదిరాజ్‌ల అభ్యున్నతికి యువత పాటుపడాలని డాక్టర్ కల్నల్ మాచర్ల భిక్షపతి అన్నారు. శుక్రవారం పట్టణంలో ముదిరాజ్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సురేష్ అధ్యక్షత జరిగిన విద్యార్థి, యువత సమ్మేళన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగితేనే ఆశించిన లక్ష్యం చేరగలుగుతారని చెప్పారు. సమావేశంలో అడ్వకేట్ కోట శంకర్‌ముదిరాజు, బీమా లక్ష్మణ్‌ముదిరాజ్, అజయ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మంత్రి పరామర్శ

పాలకుర్తి: మండలంలోని బమ్మెరకు చెందిన ఆలకుంట కొమురయ్య పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా ఆయనను మంత్రి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు మంత్రి సూచించారు.

కాంగ్రెస్‌పార్టీకి పూర్వ వైభవం ఖాయం

దేవరుప్పుల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమని కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నీర్మాలలో ఇటీవల మృతిచెందిన ఫ్రీడమ్ ఫైటర్లు లేగ అహల్యాదేవి, కాడబోయిన మీనమ్మ, నల్లకుంటతండాలో సూనావత్ దస్రూ కుటంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

నాయకులపై దాడి సిగ్గుచేటు

కొడకండ్ల: బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకుల దాడి సిగ్గుచేటని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ అన్నారు. శుక్రవారం మైదంచెరువు తండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ అధ్యక్షుడు శ్రీనునాయక్, శోభన్, దేవన్నలను కాంగ్రెస్ నాయకులు అకారణంగా కొట్టి దుర్భాషలాడటం సరికాదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఎంపీపీ జ్యోతి, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ యాకయ్య, మార్కెట్ చైర్మన్ రాము, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరు రెవెన్యూ పరిధి నల్లకుంట తండా గ్రామానికి చెందిన సునావత్ దస్రు మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ యువజన జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సహకారంతో రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ బానోతు రాజన్న, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బానోతు సంతోష్, మండల ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు బానోతు భోజ్యానాయక్, వార్డు సభ్యులు ఉన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర చర్మపరిశ్రమల (లిడ్‌క్యాప్) భూములు, దళితుల అసైన్డ్ భూములను రక్షించే లక్ష్యంగా ఈనెల 12న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న మాదిగ చర్మకారుల రాష్ట్ర సదస్సును మాదిగ చర్మకారులు, ఉపకులాల వారు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని లిడ్‌క్యాప్, దళిత అసైన్డ్ భూముల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కూసపాటి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. మా భూములు మాకేనని లిడ్‌క్యాప్ భూములు, దళితుల అసైన్డ్ భూముల పరిరక్షణ కోసం ఈనెల 12న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, గౌరవ అధ్యక్షుడు ఇమ్మానీయేల్, కుమారస్వామి, ఆర్.మల్లేష్, చంద్రమౌళి, ఈశ్వరయ్య, యాకయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు డీజే సౌండ్ బాక్స్‌సెట్ వితరణ

దేవరుప్పుల: దశాబ్దకాలంగా కాంటాక్టు అధ్యాపకులుగా విధులు నిర్వర్తించగా ఇటీవల ప్రభుత్వం పర్మనెంట్ చేసినందుకు కృతజ్ఞతగా స్థానిక కళాశాలకు చెందిన ఎడుగురు అధ్యాపకులు కలిసి రూ.30 వేలతో డీజే సౌండ్ బాక్సుసెట్‌ను అందజేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్న రాపోలు ప్రభాకర్‌ను అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్ తనకు లభించిన అవార్డు కళాశాలకే వర్తిస్తుందన్నారు. అధ్యాపకులు కె భాస్కర్, జి అరుణాకర్ ,జి గణేష్, పి రాధిక ,బి హరితకుమారిణి, చైతన్య, రహీమున్నీసా పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని ఇటుకాలపల్లిలో కొలుగూరి ఆగమల్లయ్య శుక్రవారం మృతి చెందాడు. కాగా ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దూడల కనుకయ్య శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేశారు.

చర్య తీసుకోవాలి

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ చారిత్రక కట్టడాలకు సంబంధించిన మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ అంజనేయులుకు గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జఫర్‌గఢ్‌లో కోట కట్టడాలకు సంబంధించిన మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. చరిత్రకు సంబంధించిన కందకాల మట్టిని పెద్ద ఎత్తున తరలించి ధ్వంసం చేశారన్నారు. ఇప్పటికైనా మట్టి తరలింపును అడ్డుకొని వారిపై చర్య తీసుకోవాలన్నారు. రాజేందర్, శీనయ్య, కోటి, సురేందర్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కొడకండ్ల: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని బోడోనికుంట తండా కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో పాలకుర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని కోరారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బానోత్ రవి, ఉపాధ్యక్షుడిగా ధరావత్ సీమా, ప్రధాన కార్యదర్శిగా బాలాజీ, కోశాధికారిగా రమేష్, కార్యదర్శిగా ధరావత్ రాజు, కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా నర్సింహులు ఎన్నికయ్యారు. సోమనర్సయ్య, రవిందర్, యాదగిరి, కర్నాకర్ ఉన్నారు.

చేయూత

లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేటలో 2020–2011 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు తోటి విద్యార్థిని పెండ్లి స్వాతికి శుక్రవారం రూ.47,000 ఆర్థికసాయం అందజేశారు. స్వాతి భర్త నాగరాజు ఐదు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో ఆమెకు ఉన్న ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుని పోషణ భారం కావడంతో చిన్ననాటి మిత్రులు ఆర్థికసాయం అందించారు. కష్టాల్లో ఉన్న తమను ఆదుకున్న తోటి మిత్రులకు స్వాతి కృతజ్ఞతలు తెలిపారు.

ఆగమ శాస్త్రం ప్రకారమే విగ్రహాల పునఃప్రతిష్ఠ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధాంతులు

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: ఎలాంటి తప్పులు లేకుండా చినజీయర్‌స్వామి చేతుల మీదుగా వల్మిడిలో సీతారాముల విగ్రహాల పునఃప్రతిష్ఠాపన జరిగిందని జనగామ సిద్ధాంతి, యాదాద్రి ఆస్థాన సిద్ధాంతులు సంపత్‌కుమార కృష్ణమాచార్య, ఆరుట్ల రామకృష్ణమాచార్య తదితరులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వల్మిడి ఆలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పూర్తిగా ఆగమ ధర్మశాస్త్రం ప్రకారమే విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగిందని, సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ఆరోపణలు నమ్మవద్దని కోరారు.

విమర్శలు సరికాదు..

వల్మిడిలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపనపై విమర్శలు సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆగమ శాస్త్రం మేరకే చినజీయర్‌స్వామి చేతుల మీదుగా విగ్రహాల ప్రతిష్ఠ జరిగిందని, వేద పండితులను విమర్శించడం సరికాదని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు హితవు పలికారు. వల్మిడి ఆలయంలో సంస్కృతి తెలుసా అని ఝాన్సీరెడ్డిని ప్రశ్నించారు. ఆలయ చరిత్రను ప్రపంచానికి తెలియజేయడానికి మంత్రి దయాకర్‌రావు రూ.50 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయించారని చెప్పారు. ధ్వజ స్తంభాల ఏర్పాటుకు సరైన యంత్రాలనే వినియోగించారని వివరించారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ రాంబాబు. సహకార సొసైటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎర్రబెల్లి రాఘవరావు, సర్పంచ్ కత్తి సైదులు, మాచర్ల ఎల్లయ్య, చెరుకు రాములు పాల్గొన్నారు.

మేధావి వర్గం ఒక్కటైతే గెలుపు మనదే..



మాట్లాడుతున్న జల్లి సిద్ధయ్య

జనగామ: మేధావి వర్గం ఒక్కటైతే గెలుపు మనదే అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జల్లి సిద్ధయ్య అన్నారు. స్థానిక రమాదేవి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం న్యాయవాదులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర కీలకమని, హైకోర్టు సీనియర్ అడ్వకేట్, స్థానికతకు పెద్ద పీట వేసి తనకు జనగామ బీఆర్ఎస్ టికెట్ ఇస్తే అన్ని వర్గాలతోపాటు న్యాయవాదులు సైతం సంపూర్ణ మద్దతు ఇస్తారని చెప్పారు. గతంలో పాలకుర్తి బీఆర్ఎస్ టికెట్ వచ్చిన సమయంలో తనకుతాను విరమించుకోలేదని, లోకల్ నేత శ్రీనివాసరావు రావడంతో తనకు మంచి అవకాశం ఇస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీతో తిరిగి వచ్చినట్లు చెప్పారు. గతంలో జడ్జిగా అవకాశం వచ్చినా, ప్రజా సేవ, రాజకీయాలపై ఉన్న ప్రేమతో ఇక్కడే ఉండిపోయానన్నారు. న్యాయవాదులు కూరెళ్ల శ్రీనివాస్ రెడ్డి, బల్లరవి, హరిశ్చంద్రగుప్త, సుధీరంజన్, రామ్మోహన్‌రెడ్డి, స్టీవెన్, రాజయ్య, స్వప్న, రాంగోపాల్, పి.శ్రీనివాస్, జమాల్‌షరీఫ్ పాల్గొన్నారు.

డీడీలు తీసిన వారికి గొర్రెలు అందించాలి



మాట్లాడుతున్న యాదగిరి

రఘునాథపల్లి: రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు తీసి ఐదు నెలలు గడిచినా గొర్రెలు ఇవ్వడం లేదని, నిర్లక్ష్యం వీడి వెంటనే అందజేయాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కావటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సంఘం మండల అధ్యక్షుడు గుండె వెంకటయ్య అధ్యక్షతన జరిగిన పెంపకం దారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెల మంజూరులో జిల్లా కలెక్టర్ నుంచి ఎమ్మెల్యేకు అప్పగించడంతో అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంపై ఈ నెల 11న తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడికి పెంపకం దారులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. రాజు, జంపయ్య, ఐలయ్య, బీరయ్య పాల్గొన్నారు.

వైభవంగా గోపాలస్వామి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

జఫర్‌గఢ్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మండల కేంద్రంలో గోపాలస్వామి కాల్వలు(రథోత్సవం) శుక్రవారం కన్నులపండువగా జరిగాయి. ప్రతి ఏటా జరిగే ఈ వేడుకలను ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయాన్నే గోపాలస్వామి ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేశారు. అనంతరం మంత్రోచ్ఛరణల మధ్య వేదపండితులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక గాంధీ సెంటర్‌లో ముదిరాజ్ యువకులు స్తంభం జారుడు, గ్రామస్తులు ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వరకు సాగిన స్వామివారి రథోత్సవంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు వెంకటచార్యులు, శ్రీనివాసచార్యులు, కృష్ణమచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ

బచ్చన్నపేట: బండనాగారంలో ఇటీవల చల్ల కమలమ్మ, బరాబరి శోభ మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన పనులే తప్ప ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైఎస్ హయాంలోనే ఈ ప్రాంత కరువును నివారించడానికి దేవాదుల కాల్వను మంజూరు చేయించినట్లు చెప్పారు. ఉప సర్పంచ్ రాజలింగం, చల్ల సుధాకర్ ఉన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

జఫర్‌గఢ్: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండి షభానా విమర్శించారు. ఐద్వా ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి)లో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అమె మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరల పెరగడంతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంఘం నాయకురాల్లు బక్క యాదమ్మ, నక్క అనూష, రజిత, నక్క శారద, ఉప్పునూతల ఎల్లమ్మ, దొంతూరి సంధ్య, రాపర్తి లక్ష్మి, ఎల్లమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

'కల్వకుంట్ల కుటుంబం చేతిలో తెలంగాణ బందీ'



సమావేశంలో అభివాదం చేస్తున్న ఝాన్సీరెడ్డి, యూత్ నాయకులు

పాలకుర్తి టౌన్: నీళ్ల నిధులు నియామకాల కోసం బలిదానాలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం కల్వకుంట్ల కుటుంబం చేతిలో బందీ అయిందని టీపీసీసీ సభ్యురాలు, పాలకుర్తి నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శివం గార్డెన్‌లో యూత్ కాంగ్రెస్ నియోజవర్గ స్థాయి సమావేశంలో ఝాన్సీరెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో యువకుల బలిదానాలు చేసుకున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం యువత సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. యువత సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి శివం గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నియోజవర్గ అధ్యక్షుడు ధారవత్ సురేస్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, హమ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ప్రజాధనం దుర్వినియోగం

రూ.60 కోట్లతో నిర్మించిన వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం హంగులు, ఆర్భాటాలతో నాణ్యతలేని కట్టడాలు నిర్మించడం వల్లనే ఆలయ ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం విరిగిపోయిందని ఝాన్సీరెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. గిరగాని కుమారస్వామి, అనుముల మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, జలగం కుమార్, భాస్కర్, ఐలేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నియంత తరహా పాలనకు చరమగీతం పాడాలి

కొడకండ్ల: పోరాడి సాధించుకొన్న తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ నియంత పాలన సాగిస్తుందని, కేసీఆర్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. రామవరం గ్రామంలోని జాలుబాయిగడ్డకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, ఉపాధ్యక్షుడు మహేందర్, సోమనర్సయ్య, నక్క సారయ్య, యాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

బచ్చన్నపేట: చిన్నరామంచర్లలో నిర్మించిన నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, ఎర్రపోచమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం విగ్రహాలను డప్పువాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించగా మహిళలు హారతులు పట్టారు. అనంతరం విగ్రహాలకు జలాధివాసం చేశారు. శనివారం ప్రతిష్ఠాపన ఉంటుందని సర్పంచ్ ఎండి. ఖలీల్ అజాం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గుర్రాల లలిత నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ పినింటి బాపిరెడ్డి, జాగృతి మాజీ అధ్యక్షురాలు పినింటి కావ్యశ్రీరెడ్డి, గ్రామస్తులు పాల్గొనగా పాండురంగ శాస్త్రి, సుబ్రమణ్య శాస్త్రి క్రతువులు నిర్వహించారు.